క్లుప్తంగా

అభయాంజనేయుడికి వెండి కిరీటం బహూకరణ



మనుబోలు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని యాచవరంలోని అభయాంజనేయస్వామికి బెల్లంకొండ గోవర్ధన్ అనే భక్తుడు వెండి కిరీటాన్ని శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించి వెండి కిరీటాన్ని అలంకరించారు.ఆంజనేయస్వామిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైకుంఠపురంలో సీమంతాలు

నెల్లూరు(అర్బన్): మదర్స్ డేను పురస్కరించుకొని నగరంలోని వైకుంఠపురంలో పలువురికి సీమంతాలను విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. చీరలు, పండ్లు, గాజులు, తదితరాలను అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి, సభ్యులు కుసుమ, రమ, రాధమ్మ, రాము పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ ఎన్నిక

నెల్లూరు(పొగతోట): ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ ఎన్నికలను గుంటూరులో శనివారం నిర్వహించారు. జిల్లాకు చెందిన ముగ్గురు ఉద్యోగులు రాష్ట్ర పదవులకు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా భీమిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మాబాషా, ప్రచార కార్యదర్శిగా సుబ్బారావు ఎన్నికయ్యారు.

వీణాగాన విభావరి



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో వీణాగాన విభావరిని వీనులవిందుగా శనివారం నిర్వహించారు. డాక్టర్ ఎస్వీఎస్ సంగీత కళాపీఠ ఆధ్వర్యంలో వెంకట శ్రీలక్ష్మి శిష్య బృంద నేతృత్వంలో కార్యక్రమాన్ని జరిపారు. శాంతి కళాధర్, ఈశ్వర్‌పాయ్ వాద్య సహకారం అందించారు. శిరోమణి శర్మ, నాగదేవీప్రసాద్ పాల్గొన్నారు.

శిక్షణకు హాజరుకావాలి

నెల్లూరు (టౌన్): డీఎస్సీ – 2018, 2008, 1998 (ఎమ్టీఎస్), 2018 ఎల్పీ తెలుగు, స్కూల్ అసిస్టెంట్లకు 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇండక్షన్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నామని ఏడీ గ్లోరీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 19 వరకు తొలి విడత, 22 నుంచి 26 వరకు రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు.

గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని నెల్లూరు జిల్లా గౌడ, కల్లుగీత పారిశ్రామికుల సంఘ అధ్యక్షుడు ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 450 మార్కులకుపైగా సాధించిన గౌడ విద్యార్థులకు రూ.ఐదు వేలు, మెమెంటో, కాలిక్యులేటర్‌ను అందజేసి తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించనున్నామన్నారు. మార్కుల జాబితా జిరాక్స్ కాపీ, కుల సర్టిఫికెట్, రెండు ఫొటోలు, మొబైల్ నంబర్, చిరునామాతో కూడిన వివరాలను రాజశేఖర్‌గౌడ్, 24 - 3 - 390, మూడో వీధి, సుజాతమ్మ కాలనీ, దర్గామిట్ట, నెల్లూరుకు జూన్ 15లోపు పంపాలని కోరారు. వివరాలకు 81424 42333, 91777 56265 నంబర్లను సంప్రదించాలని సూచించారు. రాజశేఖర్‌గౌడ్, ముత్యంగౌడ్, రామకృష్ణగౌడ్, రామచంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి

నెల్లూరు(బారకాసు): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నేతలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. సంఘ జిల్లా జనరల్ సెక్రటరీ ప్రసాద్, అసోసియేట్ చైర్మన్ శరత్‌బాబు, కో చైర్మన్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ చైతన్యకిషోర్, చిన్నయ్య, శ్రీకాంత్, సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో అమలు ఘనత వైఎస్సార్‌సీపీదే

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈదూరు గ్రామ సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని నెరవేర్చారని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ పథకాల అమలుతీరును తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గడప గడపలో గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా అడుగులు ముందుకేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అసంపూర్తిగా మిగిల్చిన అభివృద్ధి పనులతో పాటు అనేక సమస్యలను పరిష్కరించేందుకు గడప గడపకు కార్యక్రమం వేదికగా నిలిచిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లీనిక్‌లు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులు, యంత్రాలను అందజేయడం పాటు ధాన్యం కొనుగోళ్లు సైతం చేపడుతున్నామన్నారు. ఈ ఏడాది ధాన్యానికి గిట్టుబాటు ధరలు అందించి రైతుల కళ్లల్లో సంతోషం చూశామన్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యను పరిష్కరించి సీఎం వైఎస్ జగన్ ఆదర్శంగా నిలిచారన్నారు. దాదాపు నాలుగు మాసాలుగా నిర్వహిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శులు ఇసనాక రమేష్‌రెడ్డి, కోడూరు దిలీప్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, టంగుటూరు సురేష్‌రెడ్డి, మోచర్ల మధు, నెలవాయి రమేష్‌రెడ్డి, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, మన్నెం చిరంజీవులగౌడ్, కోటా శేఖర్‌రెడ్డి, సర్పంచ్ టంగుటూరు శ్రీలక్ష్మి, ఇనకల్ల వేణుగోపాల్, వినోద్, నవీన్, గోళ్ల సురేష్, కాయల జోసఫ్, ఉప్పల పరమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం వైఎస్ జగన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాంధవుడిగా నిలిచారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పెళ్లకూరు కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తరతరాలుగా చుక్కల భూములను సాగుచేసుకుంటున్న రైతులు వాటిపై హక్కులు కలిగి లేక అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యకు సీఎం వైఎస్ జగన్ శాశ్వత పరిష్కారం చూపుతూ రైతన్నలకు సంపూర్ణ హక్కులు కల్పించారన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా వెలగబెట్టిన చంద్రబాబు ఏ నాడు కూడా చుక్కల భూముల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. జగనన్న పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరగకుండా, పైసా ఖర్చు లేకుండా రైతులకు చుక్కల భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు అందజేశారని వివరించారు. కోవూరు నియోజకవర్గంలోని 1988 సర్వేనంబర్లలోని 2673 ఎకరాల చుక్కల భూములకు విముక్తి కల్పించారని తెలిపారు. కోవూరులో 50, కొడవలూరులో 582, విడవలూరులో 1687, బుచ్చిరెడ్డిపాళెంలో 230, ఇందుకూరుపేటలో 124 ఎకరాలకు హక్కులు కల్పించినట్లు వివరించారు. చుక్కల సమస్యలను పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌కు జిల్లా రైతాంగం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలతో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలవాలన్నారు. డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైస్‌ఎంపీపీ నరసింహమూర్తి, చిరంజీవి, సుబ్బారెడ్డి, కృష్ణ, వేణుగోపాల్, అంజనరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణ



వైనతేయ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



నగదు విరాళం అందజేస్తున్న దాతలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ చేశారు. అనంతరం అగ్నిప్రతిష్ట, వైనతేమేష్టి, సత్సంతానప్రాప్తి వైన తేయహోమం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు శ్రీవారిని విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు.

నేడు సూర్యప్రభ వాహన సేవ

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7.30 గంటలకు సుదర్శన నారసింహమేష్టి హోమం, 9 గంటలకు సూర్యప్రభ వాహనసేవ, సాయంత్రం 7 గంటలకు హనుమంత వాహనసేవ, ఎదుర్కోలు ఉత్సవం, చంద్రప్రభవామనం ఉంటాయని ఉత్సవాల నిర్వాహకులు వెల్లడించారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణకు రూ.2 లక్షల విరాళం

శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వాహణకు దేవస్థానం కమిటీ అధ్యక్షుడు పెండ్యాల రమణయ్యనాయుడు దంపతులు రూ.2 లక్షల నగదు విరాళాన్ని ప్రకటించారు. ఈ నగదును దేవస్థానం కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డికి శనివారం అందజేశారు. సీఐ జీ సంగమేశ్వరరావు, ఎం శ్యాంప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేస్వామి బ్రహ్మోత్సవాలు



కొడవలూరు: స్థానిక దళితవాడలో ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సీతారామలక్ష్మణ హనుమత్ మూలమంత్ర హోమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత కొడిగుడ్ల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం బాలదాసుల అన్నదానం, పంజు సేవలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెన్సిల్‌పై హనుమంతుడు



మనుబోలు మండలం యాచవరానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము పెన్సిపల్‌పై ఆంజనేయుడి ప్రతిమను రూపొందించాడు. హనుమజ్జయంతి సందర్భంగా సూక్ష్మ ఆంజనేయుడి ప్రతిమను ప్రదర్శించి తన భక్తిని చాటుకున్నారు.

–మనుబోలు

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

తోటపల్లిగూడూరు: విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సంతోష్, సందీప్, శ్రీకాంత్ శనివారం తెలిపారు. విజేత జట్టుకు రూ.50వేలు, రన్నర్ జట్టుకు రూ.40వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. చిన్నచెరుకూరు హైస్కూల్ మైదానంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ముందుగా ప్రతి జట్టు రూ.1500 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. టెన్నిస్‌బాల్‌తో నిర్వహించే పోటీల్లో దాదాపు 60 జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. వివరాలకు 95053 90424, 63096 15044, 98856 12190 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెంలో పెన్నా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై ఎస్ ప్రభాకర్‌రావు తన సిబ్బందితో కలిసి శనివారం పట్టుకున్నారు. వాహనాలపై కేసు నమోదు చేసి ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

వైఎస్సార్ యంత్ర సేవా పథకం ప్రారంభం

నెల్లూరు రూరల్: కోడూరుపాడులోని సొసైటీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఉళ్లమ్మతల్లి గ్రూపు రైతులకు రూ.15 లక్షల విలువజేసే వ్యవసాయ పరికరాలను 40 శాతం సబ్సిడీపై అందజేశారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కమలాకర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసులు, ఏఓ నాగమోహన్, సొసైటీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్సార్ ట్రస్టు ద్వారా రూ.2.10లక్షల సాయం



చిన్నారులకు నగదు బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: పెళ్లకూరు కాలనీకి చెందిన పలువురు బాధితులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పెళ్లకూరుకాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్య, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న పది మందికి ఎన్ఎస్సార్ ట్రస్టు ద్వారా రూ.2.10లక్షలు సాయం అందజేశారు. షేక్ షాబ్జాన్‌కు రూ.10వేలు, సయ్యద్‌షానుకు రూ.20వేలు, పత్తికోట లక్ష్మికి రూ.20వేలు, షేక్ చాన్‌బాషాకు రూ.20వేలు, పాలపర్తి పెంచలమ్మకు రూ.20వేలు, తన్నుబోయిన సుగుణమ్మకు రూ.20వేలు, కమ్మ నాగశ్రీకి రూ.20వేలు, చేజర్ల సుజాతకు రూ.10వేలు, హర్షవర్ధన్‌కు రూ.25వేలు, కర్లగంట షారోన్‌కు రూ.20వేలు, రామిశెట్టి పోలమ్మకు రూ.25వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

మనుబోలుకు చేరిన పాఠ్యపుస్తకాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

మనుబోలు: 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందజేయనున్న పాఠ్యపుస్తకాలు మనుబోలుకు శనివారం చేరాయి. తొలి విడతగా 16,890 పాఠ్యపుస్తకాలు రాగా మనుబోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో వాటిని భద్రపరిచారు. మొదటి విడతగా వచ్చిన పుస్తకాలను ఎంఈఓ శేషాద్రివాసు పరిశీలించారు. మిగిలిన పుస్తకాలు రెండో విడతలో వస్తాయని తెలిపారు. విద్యార్థుల బెల్టులు, పుస్తకాల నాణ్యతను నాడు–నేడు ఏఈ అహ్మద్‌బాషా పరిశీలించారు. వారి వెంట ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆదిశేషయ్య, ఎమ్మార్సీ సిబ్బంది రమేష్, షౌకత్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

వెంకటాచలం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఫారెస్ట్ రేంజర్ మాల్యాద్రి అన్నారు. మండలంలోని తిక్కవరప్పాడు అటవీ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన లైఫ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను విచక్షణారహితంగా నరికేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి తీవ్రముప్పు వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ చెట్లను పెంచడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ శేషయ్య, ఎఫ్‌బీఓ రవిశేఖర్, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటా

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): జర్నలిస్టులకు అండగా ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో శనివారం నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు చెముడుగుంట ప్రాంతంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేసి స్థలాలిచ్చేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డితో పాటు పలువుర్ని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, ఎమ్మెల్సీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు షాపులో చోరీ

నెల్లూరు రూరల్: నరుకూరు సెంటర్‌లోని ఓ బంగారు షాపులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బంగారు షాపును నిర్వహిస్తున్న షబ్బీర్ దుకాణానికి శుక్రవారం తాళాలేసి ఇంటికెళ్లారు. తాళాలు పగలగొట్టి ఉండటాన్ని శనివారం ఉదయం ఆయన గమనించారు. వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గుర్తించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన వాటి విలువ రూ.1.7 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



హనుమజ్జయంతి ఉత్సవాలకు ముస్తాబైన వీరాంజనేయస్వామి ఆలయం

ముత్తుకూరు: స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ శనివారం వెల్లడించింది. హనుమజ్జయంతి సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు నారాయణంరంగాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, సుందరకాండ పారాయణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ నెల 25న రాత్రి గ్రామోత్సవం, 26న రాత్రి అన్నప్రసాద వితరణతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఉభయకర్తల సహకారంతో ప్రతిరోజూ రాత్రి సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించాలి



గృహ నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరు జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను శనివారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో పెద్దూరు, కట్టుబడిపాళెం, బాలికోన్నత పాఠశాల వెనుక భాగాన ఉన్న జగనన్న కాలనీ లేఅవుట్లలో గృహ నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కాంట్రాక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



చిన్నారులతో మాట్లాడుతున్న విశ్రాంత హెచ్‌ఎం వెంకయ్య

కొడవలూరు: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని విశ్రాంత హెచ్‌ఎం వెంకయ్య పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం చిన్నారులతో మెమరీ గేమ్ ఆడించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా వచ్చిన వెంకయ్య మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఎంతో ఉపయుక్తమైన పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలన్నారు. వేసవిలో ఎండకు తిరగకుండా వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి కే రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో చోరీలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై వెంకటరాజేష్

ఇందుకూరుపేట: వేసవిలో చోరీలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకట్‌రాజేష్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఆరుబయట, మిద్దెలపైన పడుకునే వారు జాగ్రత్తగా ఇళ్లకు తాళాలు వేసుకోవాలని సూచించారు. వీలైతే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో ఊర్లకు వెళ్లే వారు పోలీస్‌స్టేషన్‌లో లేదా సచివాలయ మహిళా పోలీసులకు సమాచారం అందజేస్తే భద్రత కల్పిస్తామని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. మైనర్లు నడిపే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులది బాధ్యతగా భావించి చట్టపరమైన చర్యలు చేపడుతామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. స్నేహితులకు వాహనాలు ఇచ్చే సమయంలో లైసెన్స్ ఉందా..లేదా అని ధ్రువీకరించుకుని ఇవ్వాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యజమానిని సైతం నిందితుడిగా గుర్తిస్తామన్నారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట, తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై కోరారు.